మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్ అన్నారు. గౌతమీనగర్ కాలనీలో రూ. 10లక్షలతో శనివారం సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. గౌతమీనగర్ కాలనీ అధ్యక్షులు దుర్గయ్య, కాలనీవాసులు ముత్యాలు, సారయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన నందికంటి శ్రీధర్



అల్వాల్: తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును శనివారం తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

హైడ్రా దృష్టికి కాప్రా చెరువు!

- ఊర చెరువును కాపాడాలంటున్న స్థానికులు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌గా గుర్తించాలని వినతి
- కేసీసీసీ ఆధ్వర్యంలో పోరాటాలకు రంగం సిద్ధం



కాప్రా: ఎంతో ఘన చరిత్ర కలిగిన కాప్రా చెరువు కనుమరుగవుతుందామోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువును ఊర చెరువు అని కూడా పిలుస్తారు. గతంలో చెరువు విస్తీర్ణం 1,254 మీటర్లు ఉండేది. గతంలో సమీప పంటపొలాలకు సాగునీరు, భూగర్భ జలాల పరిరక్షణలో ఈ కాప్రా చెరువు కీలక పాత్ర పోషించింది. ప్రజలకు ప్రధాన తాగునీటి వనరుగా కూడా ఈ చెరువు నిలిచింది. దశాబ్దం క్రితం కాలుష్య రహితంగా ఉన్న ఈ చెరువు గత కొంతకాలంగా కలుషితమైంది.

నాడు వందల ఎకరాలు.. నేడు పదుల సంఖ్యలో..

కాప్రా చెరువు విస్తీర్ణం 204 ఎకరాలు కాగా.. తదానంతరం 123 ఎకరాలకు కుచించుకుపోయింది. 2002లో నిర్వహించిన సర్వే ప్రకారం 113 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని తెలుస్తోంది. అనంతరం భూ ఆక్రమణలతో అది కాస్త 70 ఎకరాలకు తగ్గింది. ఇక ప్రస్తుతం 60 ఎకరాల విస్తీర్ణం కూడా లేదంటున్నారు స్థానికులు.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ మాయం..

ప్రస్తుతం కాప్రా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ కూడా మాయమైపోయిందని వాపోతున్నారు. గతంలో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం హద్దులు కనిపించకుండా పోయాయని చెబుతున్నారు.

ఎఫ్‌టీఎల్ అంటే..

ఎఫ్‌టీఎల్ అంటే ఫుల్ ట్యాంక్ లెవల్. వర్షాకాలంలో వరద నీటితో నిండినదాన్ని ఎఫ్‌టీఎల్‌గా గుర్తిస్తారు. కాప్రా చెరువును కూడా నాడే ఎఫ్‌టీఎల్‌గా నిర్ధారించారు. వర్షం, వరదనీరు లేకున్నా ఆ ప్రాంతం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూములున్నా.. నీళ్లులేని సమయంలో మాత్రమే అక్కడ వ్యవసాయం చేసుకోవచ్చు. నీరు ఉంటే మాత్రం ఆ భూములను వదిలేయాల్సిందే. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టొద్దని నిబంధన ఉంది.

యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..

కాప్రా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు దాటేసి నిర్మాణాలు చేపట్టారని స్థానికులు చెబుతున్నారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ హద్దులు చెరిపేసి, వాటికి సంబంధించిన ఆనవాళ్లు కూడా మాయం చేసి నిర్మాణాలు వెలిశాయనేది పలువురి వాదన. కొత్త విస్తీర్ణాన్ని కాపాడుకోవాలని స్థానికులు నడుం బిగించారు. చెరువు విషయంపై సంబంధిత అధికారులను గతంలో కలిసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. గ్రేటర్ పరిధిలో ఆక్రమణలపై కొత్త ప్రభుత్వం హైడ్రా జెట్‌స్పీడ్‌తో దూసుకుపోతుండటంతో ఈసారి హైడ్రాను కలిస్తే చెరువును రక్షించుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఆ దిశగా హైడ్రా కూడా కాప్రా చెరువుపై దృష్టిసారించి పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి..

కాప్రా కాలనీస్ కో– ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో చెరువును కాపాడుకునేందుకు పోరాటాలకు రంగం సిద్ధమైంది. గతంలో ఎన్నోసార్లు చెరువు విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లామని పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి హైడ్రాను ఏర్పాటు చేసింది. దీంతో స్థానికులు మరోసారి వినతుల కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరోసారి సంబంధిత శాఖల అధికారులను కలిసి విజ్ఞప్తి చేయాలని చూస్తున్నారు. హైడ్రా కమిషనర్‌ను కూడా కలిసి కాప్రా చెరువు విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తామంటున్నారు కేసీసీసీ ప్రతినిధులు.

హైడ్రాను కలుస్తాం..



కాప్రా చెరువు విషయంలో ఈసారి హైడ్రా కమిషనర్‌ను కలుస్తాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలకు అధికారులు అనుమతించడం సరికాదు. ఈ విషయంపై విచారణ జరగాలి. ఇదే అంశాలను హైడ్రా కమిషనర్‌ను కలిసి వివరిస్తాం.
– సంజీవరెడ్డి, కాలనీల కో– ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు

చెరువు పరిరక్షణకు ముందుండి పోరాడతాం..



కాప్రా చెరువును కాపాడుకునేందుకు వివిధ కాలనీవాసులతో కలిసి పోరాడుతాం. గతంలో వందల ఎకరాల్లో ఉన్న చెరువు కనీసం 60 ఎకరాల్లో కూడా లేదనిపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలి. చెరువును రక్షించుకునేందుకు కేసీసీ ఆధ్వర్యంలో పోరాడుతాం.
– భైరి భాస్కర్‌గౌడ్, ఎల్లారెడ్డిగూడ

బఫర్ జోన్‌ను మాయం చేశారు..



కాప్రా చెరువు బఫర్ జోన్‌ను మాయం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్నో ఇళ్లు వెలిశాయి. చెరువులోకి వరదనీరు వచ్చేందుకు పైపులైన్ వేస్తే దాన్ని కూడా మాయం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చుక్క వర్షపునీరు కూడా చెరువుల్లోకి వెళ్లడం లేదు. చెరువును కాపాడుకునేందుకు కేసీసీ ఆధ్వర్యంలో పోరాడేందుకు నిర్ణయించుకున్నాం. సంబంధిత అధికారులు స్పందించి చెరువును పరిరక్షించాలి.
– రవికుమార్, స్థానికుడు

రూ.64 లక్షలతో అభివృద్ధి పనులు



పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి : మౌలాలి డివిజన్‌లోని మారుతినగర్‌లో సుమారు రూ.64 లక్షలతో ఆర్‌సీసీ పైపులైన్ పనులను మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఈ మధురిమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర, మహేందర్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, మూర్తి, శ్రీనివాస్, కిరణ్, నాగరాజు, రవీంద్ర, రుద్రరాజు, జయనంద్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగారావు, డివిజన్ కార్యదర్శి శివగౌడ్, రమణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



మినీ శిల్పారామంలో భరత నాట్య ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్‌కేఎస్ కళా నిలయం నాట్యగురువు సుందరి రవిచంద్ర శిష్య బృందంచే నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనలో భాగంగా ' శ్రీకృష్ణ లీలామృతం' నృత్య రూపకాన్ని ప్రదర్శించి మెప్పించారు. సుతులాల, శ్రీకృష్ణ జననం, చిన్ని కృష్ణుడు వెన్న దొంగతనం, ఉట్టి కొట్టడం, కళింగ నర్తనం, గోపికావస్త్రాపహరణం, గోవర్ధన గిరిధారి, గంధము పూయరుగా లాంటి ప్రదర్శనలతో నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డెంగీ, చికెన్‌గున్యా మలేరియా వంటి వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఎంటామాలజీ అధికారులు, సిబ్బందికి సూచించారు. శనివారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో ఎంటమాలజీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దోమల నివారణకు మురుగు నీటి నిల్వలు లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతంలో ఆయిల్‌బాల్స్, రసాయనాలు చల్లాలని, కాలనీలు, బస్తీలలో ఫాగింగ్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంటమాలజీ ఏఈ రమేష్, కనకరాజు, నర్సింహ్మా, మాజీ వార్డు కమిటీ సభ్యులు పీఆర్.ప్రవీణ్, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

మల్లాపూర్: నాచారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నాచారం వెస్లీ స్కూల్‌లో శనివారం ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 300 మంది విద్యార్థులకు కంటిపరీక్షలు చేశారు. 15 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. త్వరలో వారికి అందజేయనున్నట్లు డాక్టర్లు చెప్పారు. నాచారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు సదానందం. సీనియర్ లయన్ కృష్ణారెడ్డి, జోన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డిస్ట్రిక్ కేబినెట్ కార్యదర్శి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువును సందర్శించిన జోనల్ కమిషనర్



చెరువును పరిశీలించిన జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు

ఉప్పల్: ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధి, పరిరక్షణకు జీహెచ్‌ఎంసీ అధికారుల యంత్రాంగం కదిలింది. శుక్రవారం ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరిన విషయం తెలిసిందే. కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, హెచ్‌ఎండీఏ ఈఈ హరికృష్ణ, స్థానిక కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డితో కలసి చెరువును పరిశీలించారు. చెరువు అభివృద్ధికి వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. డీసీ ఆంజనేయులు, ఈఈ నాగేందర్, ఈఈ ప్రాజెక్టు రోహిణి, మెట్రోరైల్ ప్రాజెక్ట్ అధికారి నర్సింగరావు, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



నాగోల్ మెట్రోస్టేషన్ ఎదుట పోస్టర్‌ను ఆవిష్కరించిన పీవైఎల్ ప్రతినిధులు

ఉప్పల్: నాగోల్, మియాపూర్ మెట్రోస్టేషన్ల వద్ద యథావిధిగా ఫ్రీ పార్కింగ్ పద్ధతిలో కొనసాగించాలని లేదంటే ప్రజాసంఘాలు, ప్రయాణికుల మద్దతుతో భారీఎత్తున ఆందోళన చేస్తామని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) హెచ్చరించింది. ఈ మేరకు మెట్రో పార్కింగ్‌ను నిరసిస్తూ.. ఆగస్టు 25న ఉప్పల్ మెట్రో స్టేషన్ల వద్ద ధర్నా , ఆందోళన చేయనున్నట్లు ప్రకటించింది. శనివారం ఉప్పల్ నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద వాల్‌పోస్టర్‌ను అవిష్కరించారు. మెట్రో పుట్టినప్పటి నుంచి ఈనాటి వరకు ఉచిత పార్కింగ్ వ్యవస్థ ఉన్నందునే ప్రయాణికులు మెట్రోను ఆదరించారన్నారు. కొత్త పార్కింగ్ చార్జీలు వసూలు చేయడం సరికాదన్నారు. యూత్ లీగ్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్ ప్రదీప్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, కృష్ణ, శ్రీనివాస్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగోల్ మెట్రో స్టేషన్‌వద్ద ధర్నా..

ప్రోగ్రెసివ్ యూత్ లీగ్, మెట్రో ప్రయాణికులతో కలిసి ఆదివారం ఉదయం 9 గంటల నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ప్రయాణికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ పార్కింగ్ ఫీజు పెంపును వ్యతిరేకించాలని వారు కోరారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అల్వాల్: నేరేడ్‌మెట్ వాజ్‌పేయ్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రగ్స్ మనిషి జీవితాన్ని నాశనం చేస్తుందని, యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నేరేడ్‌మెట్ పోలీసులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, పాఠశాల చైర్మన్ నవనీతరావు

మల్లాపూర్: సరూర్‌నగర్‌లో జరిగిన జాతీయ కరాటే పోటీలో నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌కు చెందిన 8 మంది విద్యార్థులు రాణించారు. అక్కినేని యువన్, లక్ష్మీఆరాధ్య, ఆయుష్, అక్కినేని సారా కరాటేలో బంగారు పతకాలను సాధించారు. చందన్ రజత, కార్తీక, ప్రణవ్‌లు కాంస్య పతకాలను సాధించారు. శనివారం పాఠశాల చైర్మన్ నవనీతరావు, ప్రిన్సిపాల్ సుమామీనన్ విద్యార్థులను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కరాటే నేర్చుకుంటే అమ్మాయి, అబ్బాయిలైనా విద్యార్థిదశలో కరాటే విద్యను నేర్చుకుంటే ఆరోగ్యంతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. అమ్మాయిలకు ఆత్మరక్షణ కోసం కరాటే విద్య చాలా ఉపయోగపడుతుందన్నారు.

కాలనీ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తా..



కుషాయిగూడ : సోనియాగాంధీనగర్ కాలనీ అభివృద్ధికి తన తోడ్పాటును అందిస్తానని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. శనివారం కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా అభినందించారు. కాలనీ సమస్యలపై కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం లభించేలా చూస్తానన్నారు. ప్రభావతి, వెంకట్‌రావు, రాంచందర్, ప్రసాద్‌బాబు, యాకుబ్, కృష్ణ, సతీష్, ప్రతాప్‌రెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేటర్ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా జగన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గ్రేటర్ పరిధిలో బదిలీల్లో భాగంగా ఖైరతాబాద్ డీసీగా విధులు నిర్వహిస్తున్న జగన్‌ను కాప్రా సర్కిల్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు కాప్రా డీసీగా విధులు నిర్వహించిన ముకుందరెడ్డి అంతర్గత బదిలీల్లో భాగంగా శేరిలింగంపల్లి జోన్‌కు బదిలీ కాగా.. శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వుల మేరకు శనివారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా జగన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

కృష్ణం వందే జగద్గురుమ్ !



శ్రీకృష్ణాష్టమి సంబరాలు వివిధ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. శనివారం విద్యార్థినీవిద్యార్థులు రాధాకృష్ణ, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. చిన్నారులు ఉట్టి కొడుతూ.. వేడుకలను సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతి ఉట్టిపడేలా చేసుకున్నారు. శ్రీకృష్ణ కుచేలుర స్నేహబంధంలోని గొప్పతనం గురించి విద్యార్థులకు ఆధ్యాపకులు వివరిస్తూ.. ప్రతి విద్యార్థి శ్రీకృష్ణుడిలా తమ మిత్రులకు కష్టాల్లో తోడుగా ఉండాలని సూచించారు.
– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం



కాకతీయలో రాధాకృష్ణ వేషధారణలో..



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



సరస్వతీ స్కూల్‌లో..



గోపికలతో కృష్ణ వేషధారణలో వెన్న తింటూ..



శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో..



చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో..



ఐరిజ్ గ్లోబల్ స్కూల్‌లో..



వివేకానంద స్కూల్‌లో ఉట్టి కొడుతూ..



గోపికల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

బీజేపీలోకి డాక్టర్ రమేష్ బాబు

మల్కాజిగిరి: మల్కాజిగిరికి చెందిన ప్రముఖ డాక్టర్ గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి విశ్రాంత హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌బాబు బీజేపీ పార్టీలో చేరారు. మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ టీఎన్. వెంకటేష్ ఆధ్వర్యంలో డాక్టర్ రమేష్‌బాబును ఎంపీ ఈటల రాజేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మేధావులు పార్టీలో చేరడం హర్షనీయమని మల్కాజిగిరి అభివృద్ధిలో వారి సహకారం తీసుకుంటామని ఈటల అన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

రాష్ట్రకాంగ్రెస్ బీసీసెల్ కన్వీనర్‌గా సుధాకర్



రామంతాపూర్: ఇందిరానగర్‌కు చెందిన గరికె సుధాకర్ రాష్ట్ర కాంగ్రెస్ బీసీ సెల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ బీసీసెల్ అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తానన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల కేబినెట్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న గోపాల్‌రెడ్డి

బోడుప్పల్: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల కేబినెట్ ప్రమాణ స్వీకారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని, ఉన్నతస్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. చదువుతో పాటు అన్ని రకాల క్రీడల్లో రాణించేలా శిక్షణ పొందాలని సూచించారు. ఈ బాధ్యతలు స్వీకరించిన విద్యార్థులు విధులను సక్రమంగా నిర్వహించి, పదవికి వన్నె తీసుకురావాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

ఉప్పల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. రామంతాపూర్ శ్రీనగర్ కాలనీకి చెందిన పులివర్తి సందీప్ (25) వృత్తి ప్లంబర్ గత కొద్దిరోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి రామంతాపూర్‌లోని లక్ష్మీనివాస్ అపార్టుమెంట్ మూడో అంతస్తు పైనుంచి కిందకు దూకాడు. దీంతో తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.